# చేనేత పరిశ్రమ అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి

**ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం**

**మంగళగిరి:** చేనేత పరిశ్రమ అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని, నేతన్నలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలబడాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు. నగరంలోని ఆటోనగర్ ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం చేనేత సూర్యుడు ప్రగడ కోటయ్య చిత్రపటానికి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిలతో కలసి ఎమ్మెల్యే ఆర్కే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ చేనేత కార్మికులు, ఉప వృత్తులపై ఆధారపడిన వారి జీవితాల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వెలుగులు నింపారని గుర్తు చేశారు. అందులో భాగంగా 50 సంవత్సరాలు వయస్సు కలిగిన చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పింఛన్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. తండ్రి బాటలో నడుస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం పథకం ద్వారా ప్రతి చేనేత కుటుంబానికి రూ.24వేల ఆర్థిక సహాయం అందజేస్తూ పూర్తిస్థాయిలో అండగా ఉన్నారని గుర్తు చేశారు. నగరంలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో 146 మంది చేనేత కార్మికులకు శాశ్వత ప్రాతిపదికన ఉపాధి కల్పించేందుకు చేనేత మగ్గాల షెడ్లను నిర్మించడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ మంగళగిరిలో కార్మికుల ప్రయోజనాల గురించి ప్రగడ కోటయ్య, దామర్ల రమాకాంతారావు వంటి మహనీయులు తమ జీవితాలను అర్పించారని కొనియాడారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ విభిన్న పథకాలతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేనేత కుటుంబాలకు రూ.3709 కోట్లు నిధులు కేటాయించామని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆప్కోలో 20 శాతం వేతనాలు పెంచడం జరిగిందని, చేనేత వస్త్రాలపై 66 శాతం రాయితీ ఇవ్వడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 50 నూతన ఆప్కో షోరూంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, నాయకులు ఆకురాతి రాజేష్, తోట శ్రీనివాసరావు, బుల్లా రాజారావు, బేతపూడి నర్సయ్య, మీనుగ ఆంజనేయులు, కిషోర్, సంకె సునీత తదితరులు పాల్గొన్నారు.



ప్రగడ కోటయ్య చిత్రపటానికి, వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

## క్లుప్తంగా

### 19న వార్డు మెంబర్ ఎన్నిక

**ఫిరంగిపురం:** మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామ 9వ వార్డు మెంబర్ మృతి చెందడంతో, ఆ స్థానానికి ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసినట్లు ఎంపీడీఓ డి.అనూరాధ సోమవారం తెలిపారు. అర్హులైన వారు 8వ తేదీ మంగళవారం నుంచి 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 11న మండలస్థాయి అధికారుల పరిశీలన, 12న ఆర్డీఓ పరిశీలన, 13న అభ్యర్థుల దరఖాస్తులు పరిశీలిస్తారన్నారు. 14వ తేదీ మధ్యాహ్నం 3గంటలలోపు నామినేషన్ విత్‌డ్రాచేసేందుకు వీలవుతుందని, తుది జాబితా ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు. 19వ తేదీ ఎన్నిక నిర్వహించి, మధ్యాహ్నం గెలుపొందిన అభ్యర్థిని ప్రకటించనున్నట్లు తెలిపారు.

### విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



**తాడేపల్లిరూరల్:** ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మహానగర్ అధ్యక్షుడు లయన్ ఎస్‌వీ గుప్త పాల్గొని మాట్లాడారు. అనంతరం పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.బుజ్జిబాబు మాట్లాడుతూ కాకుమాను జోజప్ప ఆర్థిక సహకారంతో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా 200 పుస్తకాలు, 400 పెన్నులను అందించడం అభినందనీయమని అన్నారు. లయన్స్ ప్రతినిధులు కె. నాగేశ్వరరావు, సెక్రటరి ఉమామహేశ్వరరావు, బెనర్జీ, పాఠశాల ఉపాధ్యాయులు డీవీ రమణమ్మ, కె.వెంకటేశ్వరరావు, ఎం.సుందరరావు, వి.సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



**తాడికొండ:** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం చేస్తాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తాడికొండ సర్పంచ్ తోకల సరోజిని అన్నారు. సోమవారం తాడికొండ గాంధీపార్కు, చెరువు చుట్టూ 200కు పైగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నానాటికీ పెరుగుతున్న పర్యావరణ హానిని తగ్గించేందుకు మొక్కల పెంపకం తప్పనిసరి అన్నారు. బీబీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బెజ్జం సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడికి రూ.లక్ష సాయం

**తాడేపల్లిరూరల్:** అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు తన బాధను ఎమ్మెల్యే ఆర్కేకు చెప్పడంతో చలించిన ఎమ్మెల్యే ఆర్కే వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష ఇస్తానని హామీ ఇచ్చి సోమవారం వైఎస్సార్ సీపీ నాయకుల చేత వృద్ధుడికి నగదును అందజేశారు. ఆ వృద్ధుడు ఎమ్మెల్యే మరల పునర్జన్మ ఇచ్చాడంటూ భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో మదర్‌థెరిస్సా కాలనీలో రహదారుల నిర్మాణాన్ని పరిశీలించడానికి ఎమ్మెల్యే ఆర్కే వచ్చిన సమయంలో ఓ వృద్ధురాలు తన భర్త విశ్వనాథపల్లి రామచంద్రరావు అనారోగ్యంతో బాధపడుతున్నాడని ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకొచ్చింది. ఎమ్మెల్యే విశ్వనాథపల్లి రామచంద్రరావు ఇంట్లోకి వెళ్లి చూడగా భారీ ఊబకాయంతో మంచం మీద నుంచి కదలలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించారు. తన కొడుకులు ఎవరూ తనని పట్టించుకోవడం లేదని, తన భార్యే అన్నీ చూస్తోందని ఎమ్మెల్యే ఆర్కే ముందు రామచంద్రరావు వాపోయాడు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష ఇస్తానని హామీ ఇచ్చాడు. మరుసటిరోజే ఎమ్మెల్యే ఆర్కే వైఎస్సార్ సీపీ నాయకుడు జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజుతో ఆ నగదును విశ్వనాథపల్లి రామచంద్రరావుకు అందజేశారు. తాడేపల్లి రూరల్ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, బీసీ సెల్ జిల్లా నాయకుడు కత్తిక రాఘవరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అమరా నాగయ్య, మిరియాల రాంబాబు, చిలకయ్య, చాగంటి బాపిరెడ్డి, చాగంటి కోటిరెడ్డి, నూతక్కి శ్రీనివాసరావు, నల్లపు ప్రదీప్, డేవిడ్, నల్లపు రాంబాబు పాల్గొన్నారు.



రామచంద్రరావుకు ఎమ్మెల్యే ఆర్కే ప్రకటించిన రూ.లక్షను అందజేస్తున్న నాయకులు

**తోపుడు బండ్లు అందజేత..**

**తాడేపల్లిరూరల్:** ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాక గ్రామంలో ముగ్గురు వ్యక్తులకు వారి వ్యాపార అభివృద్ధి నిమిత్తం మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహకారంతో తోపుడు బండ్లను సోమవారం పెనుమాక వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దామేష్‌రెడ్డి చేతుల మీదుగా చిరువ్యాపారులకు అందజేశారు. పెనుమాకకు చెందిన షేక్ నూర్జహాన్, వేమవరపు దేవ భూషణం, గుగ్గులోతు బంగారి అనే చిరువ్యాపారుల వ్యాపార అభివృద్ధికి తోపుడు బండ్లు అవసరమని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) దృష్టికి తీసుకువెళ్ళగా స్పందించిన ఆయన వెంటనే తన సొంత డబ్బులతో తోపుడు బండ్లను తయారుచేయించి అందజేశారని తెలిపారు.

# మత్తుతో జీవితాలు చిత్తు

**తాడేపల్లిరూరల్:** మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ప్రకాష్‌నగర్ శ్రీరామ్ మెట్రిక్యులేషన్ పాఠశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తుపదార్థాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, విద్యార్థి దశలో ఒక్కసారి ధూమపానం, మద్యం సేవించడం, హెరాయిన్, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రత కోల్పోయి మానసికంగా కుంగిపోతారని వివరించారు. మత్తు పదార్థాల దుర్వినియోగంపై స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు వివరించారు. డీ ఎడిక్షన్ చికిత్స ద్వారా మత్తు పదార్థాలకు బానిసైనవారిని సాధారణ స్థితికి తీసుకు రావచ్చని, ఈ చికిత్సను అందించేందుకు నవజీవన్ బాల భవన్‌సంస్థ నూజివీడులోని బాన్‌బాస్కో డీ ఎడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందని, విజయవాడ పెజ్జోనిపేటలో ఏర్పాటు చేసిన నీతోడు మానసిక వికాస కేంద్రాన్ని ఉచితంగా సంప్రదించవచ్చని తెలిపారు. శ్రీరామ్ మెట్రిక్యులేషన్ పాఠశాల హెచ్‌ఎం ఎస్.సుమలత మాట్లాడారు. నవజీవన్ బాలభవన్ సైకాలజిస్ట్ జి.అనూష, జోనల్ కో–ఆర్డినేటర్స్ బి.రమేష్, ఎస్.జాకబ్ రాజు, బి.దేవలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి కె.శకుంతల, విద్యార్థులు పాల్గొన్నారు.

### తూటికాడ వెంటనే తొలగించాలి

**తాడేపల్లిరూరల్:** కొండవీటి వాగులో ఉన్న తూటికాడను వెంటనే తొలగించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి అనంత పద్మనాభస్వామి గుడి ఏర్పాటుచేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి ఈ విషయమై వినతి పత్రం అందజేయనున్నామని అన్నారు. సుమారు 15 కిలోమీటర్ల మేర దట్టంగా పేరుకుపోయిన తూటికాడను తొలగించాలని, లేకుంటే వర్షాలు పడితే పంటపొలాలు ముంపునకు గురవుతాయని అన్నారు. అనంతరం 19 మందితో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, సహాయ కన్వీనర్‌గా కొత్రపోలు ఈశ్వర్‌రెడ్డిలను నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి అజయ్, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, రాజధాని రైతు సంఘం అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘననివాళి

**మంగళగిరి:** నగరంలోని ఎస్సీ,ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్స్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ యాక్ట్స్ అండ్ రైట్స్ కార్యదర్శి కారుమంచి రామారావు మాట్లాడుతూ ప్రజాగాయకుడు గద్దర్ కారంచేడు, చుండూరు దళిత ఊచకోతలో తన మాటలను పాటల రూపంలో పాడి అగ్రకుల అహంకారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించారన్నారు. ఆయన అకాల మరణం దళితజాతి ఉద్యమాలకు తీరని లోటన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ సెక్రటరీ గరికముక్కు డేవిడ్, భూసి గోవిందరాజు, సీపీఐ నాయకులు గంజి వెంకయ్య, పాస్టర్ మెల్కీసెదక్, మాల మహానాడు నాయకుడు జంగం నరసింహారావు, జనచైతన్య ప్రచార కమిటీ అధ్యక్షుడు మాచర్ల ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో...**

ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు మంగళగిరి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నేతలు ఘనంగా నివాళులర్పించారు. నగరంలోని పెన్షనర్స్ హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాట్లాడుతూ పీడిత ప్రజల విముక్తి కోసం ఎన్నో పోరాటాలు చేసిన గద్దర్ మరణం దళిత జాతికి తీరనిలోటన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మందా వెంకటేశ్వరరావు, కూచిపూడి సత్యం, చందోలు విక్టర్ పాల్, కలకోటి నాగేశ్వరరావు, ఇందుపల్లి రామారావు, అద్దేపల్లి నాగేశ్వరరావు, భాస్కర్, రాజేష్, కట్టిపోగు కళ్యాణ్, గుండిమెడ నాగేంద్రం, శ్యామల పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

# యోగా పోటీలలో రావెల విద్యార్థుల ప్రతిభ

**రావెల(తాడికొండ):** జిల్లాస్థాయిలో నిర్వహించిన యోగా పోటీలలో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని పాఠశాల హెచ్‌ఎం నాగమణి, ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ రేష్మ వెల్లడించారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అండర్ –14 విభాగంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో పేరుబోయిన భార్గవి (ప్రథమ), మొక్కల అక్షయ (తృతీయ), బాలుర విభాగంలో ఆలూరి రాజేష్ (ప్రథమ) స్థానంలో నిలిచారన్నారు. 14–18 సంవత్సరాల బాలికల విభాగంలో పేరుబోయిన వెంకట త్రివేణి (ప్రథమ), మొఘల్ ఖాజాబీ(ద్వితీయ), బొంతా అనూష(తృతీయ) స్థానాలు సాధించడం తమ పాఠశాలకు గర్వకారణం అన్నారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరగబోయే యోగాసన పోటీలకు రిథమిక్ యోగా విభాగంలో దానబోయిన శిరీష, ఆలా పూజిత, దానబోయిన జ్యోతిలు పాల్గొంటారని తెలిపారు. ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో పాఠశాలలో యోగా కోసం ప్రత్యేకంగా శిక్షకుడిని ఏర్పాటు చేసి రెండేళ్లుగా ప్రత్యేక శిక్షణ అందిస్తుండటంతో విద్యార్థులు జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచారని, త్వరలో రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా విజేతలుగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. యోగా శిక్షకుడు అన్నవరపు రాకేష్, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి పోటీలలో సత్తా చాటిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం నాగమణి

# నాలుగు గ్రామాల్లో 'మిషన్ ఇంద్రధనస్సు'

**ఫిరంగిపురం:** మండలంలోని ఫిరంగిపురం1,2,3తో పాటు పొనుగుపాడు, గుండాలపాడు, నుదురుపాడు గ్రామాల్లో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం సోమవారం నిర్వహించినట్లు నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఫరీనాబేగం అన్నారు. రెండో విడత మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం ప్రారంభించారని వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయాగ్రామాల్లో ఆరోగ్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇప్పటివరకు 0–5 ఏళ్లలోపు వ్యాక్సిన్ వేయించుకోని చిన్నారులు, గర్భిణులను గుర్తించి వారికి వ్యాక్సిన్ వేస్తారన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లి తిరిగివచ్చినవారు, కంపెనీల్లో, కోళ్లఫారాలలో పనుల కోసం వచ్చిన వారి పిల్లలు, గర్భిణులకు వ్యాక్సిన్ వేస్తారన్నారు. దాంతోపాటుగా వారి వివరాలను యూ విన్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరిచి వారి ఫోన్ నెంబర్ సమాచారం అందజేస్తున్నట్లు తెలిపారు. దీనిద్వారా వారికి వ్యాక్సిన్ వేయించుకున్న సర్టిఫికెట్ తీసుకునేందుకు వీలవుతుందని చెప్పారు.



చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

**మిషన్ ఇంద్ర ధనస్సు ప్రారంభం ..**

**మంగళగిరి:** చిన్నపిల్లలు, గర్భిణులకు వచ్చే వ్యాధులను తట్టుకుని నిలబడే విధంగా రోగ నిరోధక శక్తిని పెంచే కార్యక్రమం ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్ర ధనస్సు 5.0 అని గణపతినగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పి.అనూష అన్నారు. స్థానిక ఇందిరానగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక అప్పర్ ప్రైమరీ స్కూల్ ఆవరణలో స్టేట్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన తొలి రౌండ్ మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా సోమవారం చిన్న పిల్లలకు, గర్భిణులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు, సెప్టెంబరు 11–16వరకు, అక్టోబరు 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మూడు రౌండ్లుగా వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఎయిమ్స్ సీఎఫ్‌ఎం డాక్టర్ సుప్రభ సిన్హా తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరిలో చిన్నారికి టీకాలు వేస్తున్న దృశ్యం

# స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌పై విద్యార్థులకు అవగాహన

**మోతడక(తాడికొండ):** ఆన్‌లైన్‌లో డేటా భద్రంగా ఉండాలంటే పాస్‌వర్డ్ ప్రధానమని, అప్పర్ కేస్, లోయర్ కేస్, నెంబర్, సింబల్స్ అన్నీ కలిపి ఉండేలా పాస్‌వర్డ్ ఎంపిక చేసుకోవాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్ అన్నారు. మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్ ఎంపికపై నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మెయిల్స్, సోషల్ మీడియా అకౌంట్స్, ఆన్‌లైన్ బ్యాంకింగ్, డ్రైవ్స్, క్లౌడ్ సర్వీసెస్, వర్క్ అకౌంట్‌లో పాస్‌వర్డ్ పాత్ర కీలకమన్నారు. అకౌంట్ అదనపు సంరక్షణగా టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ ఎనేబుల్ చేసుకుంటే మంచిదని, దీని ద్వారా పాస్‌వర్డ్ టైప్ చేసినా లాగిన్ అవ్వాలంటే మొబైల్ నంబర్‌కు ఓటీపీ ఎంటర్ చేయాల్సి ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాగ శ్రీనివాసరావు, సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతి డి.కల్యాణ్ కుమార్, అధ్యాపకులు బీవీ రెడ్డి, ప్రేమ్ చంద్, విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

# అభివృద్ధిని చేతల్లో చూపిస్తున్నాం

- బీఆర్ అపార్ట్‌మెంట్ వద్ద మురుగు సమస్యను త్వరలో పరిష్కరిస్తాం
- మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి

**తాడేపల్లిరూరల్:** మేము మాటలు చెప్పేవారం కాదు. చేతల్లో చేసి చూపిస్తాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మంగళగిరి నియోజకవర్గం గత 50 సంవత్సరాలలో ఎన్నడూ జరగని అభివృద్ధిని చేసి చూపిస్తున్నామని మంగళగిరి శాసన సభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బైపాస్‌రోడ్‌లో ఉన్న పలు బహుళ అంతస్తులలో ఏర్పడిన మురుగునీటి సమస్యను పరిశీలించేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ప్రస్తుతమున్న సమస్యను మా దృష్టికి తీసుకురావడం చాలా ఆలస్యమైందని, ఇక్కడ నివసిస్తున్న వీఎస్ఆర్ కేఎస్ఆర్, వీఆర్ అపార్ట్‌మెంట్స్ వారు వాట్సప్ మెసేజ్ చేసినా సమస్యను ఎప్పుడో పరిష్కరించే వారిమని, అధికారుల దృష్టికి మీరు సమస్యలను తీసుకువెళ్లినపుడు తప్పనిసరిగా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని, అలా మీరు ఎవరూ ప్రయత్నం చేయలేదని, ఇప్పుడు పెట్టిన మెసేజ్‌ని గతంలో పెట్టి ఉంటే ఎప్పుడో ఈ మురుగునీటి సమస్యను పరిష్కరించే వారని స్పష్టం చేశారు. మణిపాల్ హాస్పిటల్ వెనుక నుంచి పంటపొలాల మీదుగా తాడేపల్లి మెయిన్ రోడ్డుకు రైతుల అనుమతితో పైప్‌లైన్ వేసి తాత్కాలికంగా మురుగునీటి సమస్యను పరిష్కారం చూపించాలని ఎమ్మెల్యే ఆర్కే అధికారులను ఆదేశించారు. అలాగే బహుళ అంతస్తులకు వెళ్లే రహదారిని సీసీ రోడ్‌గా మార్చి రెండువైపులా డ్రైన్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి ఇప్పుడున్న సంప్‌ను పెంచాలని అలాగే జాతీయ రహదారి నుంచి దిగువ ప్రాంతానికి వస్తున్న మురుగునీటిని దారి మళ్లించే విధంగా జాతీయ రహదారి ఇంజినీరింగ్ అధికారులకు రాత పూర్వకంగా కార్పొరేషన్ నుంచి లెటర్‌ను అందజేయాలని సూచించారు. నెలరోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి చినబోతుల దుర్గారావు, నాయకులు పాల్గొన్నారు.



అపార్ట్‌మెంట్ వద్ద ఏర్పాటు చేసిన మురుగునీటి సంపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

# మణిపాల్‌లో అవయవదానం

**తాడేపల్లిరూరల్:** అనారోగ్యంతో మణిపాల్ హాస్పిటల్‌లో చేరిన ఒక వ్యక్తికి బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో అతడి అవయవాలతో మణిపాల్ హాస్పిటల్ వైద్యులు ఆ వ్యక్తి కుటుంబ సభ్యుల అనుమతితో మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపారు. సోమవారం మణిపాల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కంటిపూడి సుధాకర్ తెలిపిన వివరాలు.. ఎన్‌టీఆర్ జిల్లా, గోదావరి వీధి, అరండల్‌పేట, వీటీసీకి చెందిన టి.వీరభద్రరావు(68) అనారోగ్యంతో స్థానికంగా ఉన్న హాస్పిటల్‌లో చేర్పించారు. మెరుగైన వైద్య నిమిత్తం తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. అప్పటికే అతను స్పృహ కోల్పోయి ఉండడంతో వైద్య పరీక్షల అనంతరం అతని బ్రెయిన్ డెడ్ అయినట్లు పరిగణించారు. అతని భార్య టి.అనూరాధ, కుమార్తె, కుమారుడు అంగీకారం మేరకు ఆంధ్రప్రదేశ్ జీవన్‌ధాన్ చైర్మన్ డాక్టర్ కె.రాంబాబు ఆధ్వర్యంలో అవయవదానం జరిగిందని, కాలేయం, ఒక కిడ్నీని మణిపాల్ హాస్పిటల్‌లో అవసరమయిన వారికి ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించామని, కార్నియా ఎల్.వి.ప్రసాద్ ఐ హాస్పిటల్ విజయవాడ, మరొక కిడ్నీ వేదాంత్ హాస్పిటల్, గుంటూరు తరలించామని తెలిపారు. అవయవదానానికి అంగీకరించి మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపిన వీరభద్రరావు కుటుంబానికి మణిపాల్ హాస్పిటల్స్ ధన్యవాదాలు తెలియజేస్తోందని అన్నారు.



టి. వీరభద్రరరావు (ఫైల్)

# ఇంకుడు గుంతలపై అవగాహన

**ఫిరంగిపురం:** మండలంలోని నుదురుపాడు గ్రామంలోని జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు సోమవారం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా కలిగే లాభాలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇంటిముందు ఇంకుడుగుంతను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. నాలుగు అడుగుల లోతు, అంతే విస్తీర్ణంలో ఉండేలా గుంతను తీసి దానిలో కంకర, ఇసుక, మట్టి పోయించాలన్నారు. దీనిద్వారా వర్షపునీరు ఇంకుడు గుంతలద్వారా భూమిలో నిలిచి నీటి ఇక్కట్లు తొలగేందుకు సహాయకారిగా ఉంటుందని చెప్పారు. ఇంకుడు గుంతను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ.6 వేలు నగదు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని చెప్పారు. ప్రభుత్వం ఇసుక, ఇనుము, సిమెంటు తక్కువ ధరకు అందజేస్తున్నట్లు తెలిపారు. కాలనీల్లో ఇప్పటికే నీటికి ఇబ్బంది లేకుండా బోర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు

## సహోద్యోగి వైద్యచికిత్సకు ఆర్థికసాయం

**మంగళగిరి:** కిడ్నీ రోగ బాధితుడైన ఉద్యోగిపై తోటి ఉద్యోగులు మానవత్వాన్ని చాటుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం ఏరియా ఆసుపత్రి ఐసీటీసీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న మల్ల ఏసుపాదం గత కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో గత 2010 నుంచి రెండు కిడ్నీలు పాడై వారానికి నాలుగుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ఏసుపాదం కుటుంబానికి ఆసరాగా నిలవాలనే తలంపుతో ముందుకొచ్చిన ఏపీ స్టేట్ ల్యాబ్ టెక్నీషియన్స్ అండ్ ఎయిడెడ్ కంట్రోల్ ఎంప్లాయీస్ యూనియన్ రూ.2.96 లక్షల ఆర్థిక సహాయాన్ని సేకరించి చెక్కు రూపంలో సోమవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ టవర్స్‌లోని కమిషనర్ చాంబర్‌లో ఏపీశాక్స్ పీడీ జె.నివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఏపీశాక్స్ బేసిక్ సర్వీస్ డివిజన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వర ప్రసాద్, యూనియన్ వైస్ ప్రెసిడెంట్ డి.సుబ్బారావు, జనరల్ సెక్రటరీ కె.దేవచంద్ర ప్రసాద్, ట్రెజరర్ ఎస్‌ఎండీ జాకీర్ పాల్గొన్నారు.



**కోర్టు నోటీసు**

[illegible]
E.P.No.93/2022 in OS No.579/2015
[illegible]
తేదీ : 18-08-2023.
కొత్తపల్లి సంతోష్, కొత్తపల్లి సాయి శ్రీహర్ష, ఓహెచ్. అండ్ తరఫు న్యాయవాదులు, డోర్.నెం. 14-7-3, పానకాల పేట, విజయవాడ. సెల్ 9849523162

**బహిరంగ ప్రకటన**

[illegible]

K.P. LAW FIRM®
[illegible] 4/2 అరండల్‌పేట, గుంటూరు. 9440846433

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
90100 67114 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com